క్లుప్తంగా

ఆర్టీసీ బస్సులు ప్రారంభం



బస్సు నడుపుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బస్ డిపో నుంచి హైదరాబాద్‌కు వెళ్లే కొత్తగా మూడు డీలక్స్ బస్సు సర్వీసులను ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం కొద్ది దూరం బస్సును స్వయంగా నడిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ శివకుమార్, డిపో మేనేజర్ రజనీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కల్యాణం



పూజలు చేస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి పట్టణంలోని గొల్లగూడెంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం చింతా ప్రభాకర్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కౌన్సిలర్ లాడే మనీల మలేశం, పొన్న రాజేందర్ రెడ్డి, మలేశం, విజేందర్‌రెడ్డి, శ్రీశైలం, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇప్పెపల్లి సొసైటీ చైర్మన్‌గా మచ్చేందర్



మచ్చేందర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఇప్పెపల్లి సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన దాసరి మచ్చేందర్‌ను ఎమ్మెల్యే మాణిక్‌రావు సన్మానించారు. ఇటీవల్ సొసైటీ చైర్మన్‌గా ఉన్న కిషన్‌పవార్‌పై సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టగా అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆయన స్థానంలో మచ్చేందర్ నూతన చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మచ్చేందర్‌ను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, కోహిర్ మండల అధ్యక్షుడు నర్సింలుయాదవ్, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మొహిద్దీన్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు సురేష్, సర్పంచ్‌లు రాజు, నర్సింహులు, విజయ్ కుమార్, నాయకులు ఇజ్రాయేల్, బాబీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



సమ్మె చేస్తున్న వీఓఏలు

జోగిపేట(అందోల్): ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె ఆదివారంతో 7వ రోజుకు చేరుకుంది. సమ్మెకు అల్మాయిపేట మాజీ సర్పంచ్ రవి శంకర్ మద్దతు ప్రకటించి సమ్మెలో కూర్చున్నారు. కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల మండల అధ్యక్షుడు మల్లయ్య, వీఓఏలు విజయ, సునీత, స్వప్న, లక్ష్మి, సువర్ణ సుప్రియ, చంద్రిక, అనిత రేణుక, మానస, గోపాల్, అశోక్, భాగయ్య, ఆంజనేయులు, వాసవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరాలని మనోహర్‌రెడ్డికి ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: మాజీ ఎమ్మెల్యే నర్సింహారెడ్డి కుమారుడు మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరాలని సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కోరారు. పటాన్‌చెరులోని మనోహర్‌రెడ్డి నివాసానికి ముందుగా సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి వచ్చి పార్టీలో చేరాలని కోరారు. ఈ క్రమంలోనే నర్సారెడ్డి వచ్చి కాంగ్రెస్ పార్టీలోకి చేరాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే తన నిర్ణయాన్ని తెలియజేస్తానని తెలిపారు. అదేవిధంగా మా కుటుంబం కాంగ్రెస్ పార్టీ పట్ల గతంలో విధేయతగా ఉందన్నారు. మా తండ్రి నర్సింహారెడ్డి ఎమ్మెల్యేగా చేసిన సమయంలో ప్రజలకు విద్యుత్, తాగునీరు, పేదలకు ఇళ్లస్థలాలు, అస్సైన్ భూములు ఇప్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహారెడ్డి, వైద్యులు ఆదిత్యరెడ్డి, అమర్సేన్ రెడ్డి, ధీరజ్ రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి ఇంటర్, 'పది' ఓపెన్ పరీక్షలు
- ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు 2121
- 'పది' పరీక్షలు రాసే విద్యార్థులు 3633
- ఇంటర్‌కు 14, 'పది'కి 10 పరీక్ష కేంద్రాలు



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లాలో 2018–19 విద్యా సంవత్సరానికి గానూ ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి పరీక్షలను రెగ్యూలర్ ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల మాదిరిగానే నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఓపెన్ పరీక్షలను ఈ నెల 25వ తేదీ (మంగళవారం) నుంచి మే 04 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పరీక్షలు రాసేందుకు జిల్లా వ్యాప్తంగా పదవ తరగతికి 01 పరీక్ష కేంద్రాలు, ఇంటర్మీడియట్‌కు 14 కేంద్రాలను కేటాయించారు. పరీక్ష ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12–00 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు ఇంటర్మీడియట్ విద్యార్థులు 2121, పదవ తరగతి విద్యార్థులు 3,633 మంది హాజరుకానున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఉన్నతస్థాయి పర్యవేక్షణ కమిటీ, జిల్లా పరీక్ష కమిటీలతో పాటు 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, మొబైల్ పోలీస్ స్క్వాడ్ బృందాలు, అదేవిధంగా సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు.

అభ్యర్థులు పాటించాల్సిన నియమాలు..

- ప్రతి అభ్యర్థి పరీక్ష సమయం కంటే గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- ఎలాంటి నిషేధిత మెటీరియల్‌ను పరీక్షహాల్లోకి తీసుకురాకూడదు.
- పరీక్ష ప్రారంభమైన తరువాత 5 నిమిషాల తరువాత అభ్యర్థులను లోనికి అనుమతించబడదు.
- అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, పరీక్ష ప్యాడ్, పెన్నులు, పెన్సిల్, స్కేల్ మొదలగు పరీక్ష సామగ్రి వెంట తెచ్చుకోవాలి.
- క్యాల్కులేటర్, సెల్‌ఫోన్ అనుమతించబడదు

ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలు..

ఓపెన్ స్కూల్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల నారాయణఖేడ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాయణఖేడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల జోగిపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జోగిపేట, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోతిరెడ్డిపల్లి, తెలంగాణ గురుకుల పాఠశాల రంజోల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల జహీరాబాద్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంగారెడ్డి, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సంగారెడ్డి, జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాల సంగారెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల పటాన్‌చెరువు,సెయింట్ జోసెఫ్ హైస్కూల్ పటాన్‌చెరువు, విద్యాభారతి హైస్కూల్ ఆర్‌సీపురం, జిల్లా పరిషత్ హైస్కూల్ బీహెచ్ఎల్, విద్యాభారతి హైస్కూల్ బీహెచ్ఈఎల్

పదో తరగతి పరీక్ష కేంద్రాలు:

ఓపెన్ స్కూల్ పదవ తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అవి.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాయణఖేడ్, తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల అందోల్, తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల అల్గోల్ జహీరాబాద్, ఎంఆర్‌హెచ్ఎస్ జహీరాబాద్, టీఎస్ఆర్ఎస్ (బాలికల) హోతి జహీరాబాద్, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల సంగారెడ్డి, గాంధీ సెంట్‌నరీ ఉన్నత పాఠశాల సంగారెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బీహెచ్ఈఎల్, బాలుర ఉన్నత పాఠశాల ఆర్‌సీ పురం (ఎ-కేంద్రం), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పటాన్‌చెరువు.

ప్రశ్న పత్రాల స్టోరేజీ పాయింట్స్	06
డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్	24
చీఫ్ సూపరింటెండెంట్స్	24
జాయింట్ కస్టోడియన్లు	24
ఇన్విజిలేటర్లు	372

అన్ని ఏర్పాట్లు పూర్తి

ఓపెన్ పరీక్షలను రెగ్యులర్ పరీక్షల మాదిరిగానే నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో వుంటుంది.పరీక్షలు వ్రాసే అభ్యాసకులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పరీక్ష రాసే అభ్యాసకుల కోసం మంచి నీరు,మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను కల్పించాం.మాస్ కాపీయింగ్‌ను అరికట్టేందుకు ప్రతీ కేంద్రం వద్ద సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమించాం.

విజయ, ఇన్‌చార్జి డీఈఓ

బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తిదాయకం

జిల్లా వ్యాప్తంగా విశ్వగురు బసవేశ్వరుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొని బసవేశ్వరుడి త్యాగాలను కొనియాడారు. ఆలయాల్లో వీరశైవ లింగాయత్ సభ్యులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.



పటాన్‌చెరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జహీరాబాద్ టౌన్: బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



నారాయణఖేడ్: బసవేశ్వర జయంతిలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



రామచంద్రాపురంలో..



సదాశివపేట పట్టణంలో..



కోహీర్‌లో..



ఝరాసంగంలో..



మునిపల్లిలో..



సంగారెడ్డి మున్సిపాలిటీలో..



రాయికోడ్‌లో..

కరాటేతో శారీరక దృఢత్వం



బెల్టులు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర (సంగారెడ్డి): విద్యార్థులు చదువుతో పాటు కరాటేను నేర్చుకోవడం ద్వారా ఆత్మస్థైర్యం పెంపొందుతుందని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సిరిపురం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షులు మాస్టర్ పోచయ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే బెల్ట్ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి బెల్టు పోటీలకు 200 మంది విద్యార్థులకు పైగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు కరాటే బెల్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, సర్పంచ్ విజయలక్ష్మి నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, యువత అధ్యక్షులు కిషోర్, నాయకులు బుచ్చిరెడ్డి, నవీన్ గౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు స్వర్గధామం తెలంగాణ

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఇంటిగ్రేటెడ్ అగ్రి బయోటెక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పారిశ్రామిక రంగంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న విప్లవాత్మక సంస్కరణల మూలంగా తెలంగాణ రాష్ట్రం జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలకు స్వర్గధామంగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు.అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ మెడికల్ డివైస్ పార్కులో బయో ఆస్తేటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ అగ్రి బయోటెక్ సెంటర్‌ను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరుపొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్, పరిశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

పటాన్‌చెరు: భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పల్లె నుండి పట్నం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25వ తేదీ ఉదయం 10 గంటలకు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేందుకు కుట్ర

- అక్షరాలు ఇవ్వమంటే మద్యం బాటిళ్లను ఇస్తున్నారు
- సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కొండాపూర్(సంగారెడ్డి): నేడు రాష్ట్రం, కేంద్రం పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని, అక్షరాలు ఇవ్వమంటే మద్యం బాటిళ్లను ఇస్తున్నారని సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జై భీమ్ దీక్ష ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం జై భీమ్ దీక్షలో పాల్గొనేందుకు యువత చూపించే ఉత్సాహం రెట్టింపు అవుతూనే ఉందన్నారు. ధర్మాన్ని రక్షించలేని వాడు స్వేరో గా జీవించడం వ్యర్థమన్నారు. స్వేరోస్ అంటే అక్షర జ్ఞానం, ఆత్మగౌరవమని, వాటిని తూ.చ తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం ఓ చిన్నారికి జై భీమ్ అని రాస్తూ అక్షరభ్యాసం చేయించారు. దీంతో పాటు పేద విద్యార్థులకు స్వేరోస్ ఫెలోషిప్ కు సంబంధించి 25 మందికి చెక్కులను పంపిణీ చేశారు.

అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాలు కావాలి

రాష్ట్రంలోని పేద ప్రజలకు అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరితే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం చాటున దాక్కోవడానికి ప్రయత్నం చేస్తున్నారని సీఎం పై పరోక్ష విమర్శలు చేశారు. పేద విద్యార్థుల కోసం నాణ్యమైన విద్యను అందించాలని కోరితే గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ యువతను పెడదారిన పట్టిస్తున్నారన్నారు. అధికార, ప్రతి పక్షాలు రూ.25 లక్షల కోసం రెండు రోజులుగా దేవాలయాలకు తడి బట్టలతోని వెళ్లడం , ప్రమాణాలు చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం



నిజాంపేటలో ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నిజాంపేట(మెదక్): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు రమావత్ వినోద్, యూత్ కాంగ్రెస్ నాయకులు సులేమాన్, కర్ణాకర్ రెడ్డి, జాల రవి, రమేశ్, పురుషోత్తం, ప్రకాష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను దహనం చేసిన వారిలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉదయ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్, మహిపాల్‌నాయక్, స్వామినాయక్, పవన్, పద్మారావు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, భాషను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న లక్ష్మీనాథాచార్యులు

చేగుంట(తూప్రాన్): మనదేశ సంస్కృతిని, సంస్కృత భాషను కాపాడుకోవాలని చిలకమర్రి లక్ష్మీనాథాచార్యులు అన్నారు. మండలంలోని పోతాన్‌పల్లి గ్రామంలో నర్సింహశర్మ ఆధ్వర్యంలో సంస్కృత భాషాభివృద్ధిలో భాగంగా సంస్కృత సేవసదనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై. మాట్లాడుతూ.. భారత్ విశ్వగురువుగా మారుతున్న తరుణంలో సంస్కృతిని కాపాడుకోవడం సంస్కృత భాషను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దిరెడ్డి, గోవింద్, విశ్రాంత ఉపన్యాసకులు యాదగిరి, రఘురాంశర్మ, రాజేశ్వరశర్మ, వేణుగోపాలశర్మతో పాటు సంస్కృత భాషాభిమానులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌లో చేరికలు



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని కానుకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వీరారెడ్డి, నాగేందర్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, కుమార్‌గౌడ్, సుధకర్ పాల్గొన్నారు.

◆ వైఎస్సార్‌టీపీ యువత జిల్లా కార్యదర్శి రమేశ్ సస్పెన్షన్

జోగిపేట(అందోల్): పార్టీ కార్యక్రమాలకు హాజరు కాకుండా పార్టీ కార్యకలాపాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నందుకుగాను వైఎస్సార్‌టీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి రంగల్ల రమేశ్‌ను వైఎస్సార్‌టీపీ నుంచి సస్పెన్షన్ చేస్తున్నట్లు రాష్ట్ర వైఎస్సార్‌టీపీ అధికారి ప్రతినిధి, అందోలు నియోజకవర్గ ఇన్‌చార్జి సంజీవరావు ఆదివారం ప్రకటించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్‌టీపీకి నియోజకవర్గంలో చెడ్డ పేరు తీసుకువచ్చే వారిపై పార్టీ అధిష్టానం సీరియస్‌గా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

◆ ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



రాయికోడ్(అందోల్): స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ను సింగితం గ్రామ బీఆర్ఎస్ యువ నాయకుడు మహరూఫ్‌అలీ, మైనార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనార్టీ నాయకులను ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కులమతాలకు అతీతంగా అందరి సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు.

◆ ఘనంగా బీరప్ప జాతర

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని మద్దికుంట గ్రామంలో బీరప్పస్వామి జాతరను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నైవేద్యాలతో స్వామిని దర్శించుకొని బోనాలను సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

◆ ప్రశాంతంగా ముగిసిన ప్రవేశ పరీక్ష



జిన్నారం(పటాన్‌చెరు): గిరిజన గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో చేరేందుకు జిన్నారంలో ఏర్పాటు చేసిన ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను చేపట్టారు. 400లమంది విద్యార్థులకు 371మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

◆ బీఆర్ఎస్ ప్లీనరీని విజయవంతం చేయాలి

హత్నూర(సంగారెడ్డి): ఈనెల 25న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గస్థాయి ప్లీనరీ సమావేశం నర్సాపూర్‌లో నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని గ్రామాలలో 10 గంటలకు పార్టీ జెండాలను ఆవిష్కరించిన అనంతరం ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నర్సాపూర్ రావాలని శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సమావేశానికి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

◆ ఆర్థికసాయం అందజేత



జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన ప్రమీల కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. వైద్యఖర్చులకు గాను సీజీఆర్ ట్రస్టు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంఆ ప్రమీలతో పాటు ఆమె కుటుంబసభ్యులు గోవర్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జహీరాబాద్‌కు మంత్రి కేటీఆర్ రాక

జహీరాబాద్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 24వ తేదీన జహీరాబాద్‌లోని మహీంద్ర కర్మాగారానికి వస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో కర్మాగారానికి చేరుకుని రూ.వేయి కోట్లతో చేపట్టనున్న ఎలక్ట్రిక్ బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ప్లాంట్‌కు భూమిపూజ చేయనున్నారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో తిరిగి పరిశీలించనున్నారు. మంత్రి కేటీఆర్ రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తాం

నారాయణఖేడ్: ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం దైవదీనం పేర్కొన్నారు. శనివారం నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు శిక్షణ ఇచ్చారు. ఖేడ్ డిపోలో సరిపోను ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయని తెలిపారు. ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు ప్రతి అరగంటకు బస్సు నడుపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఎం మల్లేశయ్య, ట్రైనర్లు చంద్రశేఖర్, మెగ్యానాయక్ పాల్గొన్నారు.